
# సింగిల్ పేజీ కథలు

## సభాసామ్రాట్

**చంద్రానికి డిసెంబర్ నెల ముప్ఫై ఒకటవ తేదీకి అరవై ఏళ్ళు నిండుతాయి. సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ గనుక ఆ రోజే రిటైర్‌మెంట్. గత రెండేళ్ళ నుంచి ఏం రాయడం లేదుగాని, లోగడ పాతిక పుస్తకాలు అచ్చయ్యాయి. చంద్రం రచయితగా పాఠకలోకానికి బాగా పరిచయం. మా కాలనీలో చంద్రం ఒక వి.ఐ.పి.**




మా కాలనీలో ప్రతి ఇంట్లోనూ చంద్రం పుస్తకాలలో ఏదో ఒకటి తప్పకుండా వుంటుంది. అందువల్ల ఫ్రెండ్స్ సర్కిల్లోనే గాక పిల్లలు రైటర్ అంకులనీ, రైటర్ తాతనీ పిలుస్తుండడంతో తను బాగా పాపులర్.

కమ్యూనిటీ హాల్లో చంద్రానికి షష్టిపూర్తి జరపాలని మేమంతా నిర్ణయించుకున్నాం. మా నిర్ణయం చెప్పగానే చంద్రం మొహమాట పడ్డాడు.

"నాకెందుకు షష్టిపూర్తి! అటువంటివి రద్దు. సరదాగా న్యూ ఇయర్ పార్టీ చేసుకుందాం" అన్నాడు.

"న్యూ ఇయర్ పార్టీలు ఎప్పుడూ వుండేవే. ఈ సంవత్సరం నీ షష్టిపూర్తి జరుపుతాం. నీ నిర్ణయంతో పనిలేదు" అని చంద్రం నోరు మూయించేశాం.

ఇక ఏర్పాట్ల గురించి చర్చించడానికి మీటింగ్ పెట్టుకున్నాం. ఖర్చు గురించి మాకు వర్రీ లేదు. కాలనీలో మాదే పెత్తనం. వెల్ఫేర్ అసోసియేషన్ అని ఒకటి రిజిస్ట్రేషన్ చేయించి నెల నెలా మెంబర్‌షిప్ అని వసూలు చేస్తుంటాం. ఆ డబ్బు బోలెడు వుంది. వినాయక చవితి, శ్రీరామనవమి వగైరాలతో పాటు ఇల్లా సాంస్కృతిక ఉత్సవాలు కూడా నిర్వహిస్తుంటాం. ఇటువంటి వాటికి ఎంత ఖర్చుపెట్టినా ఎవ్వరూ లెక్కలు అడగరు.

"చంద్రం షష్టిపూర్తికి సభాసామ్రాట్ పార్థసారథిని పిలుద్దాం" అన్నాడు రాజగోపాలరావు.

"అబ్బే ఆయన్ని భరించగలమా? ఈమధ్య బాగా డిమాండ్ చేస్తున్నాడట. పదివేలు క్యాష్ ఇవ్వాలట. శాలువలు, మెమెంటోలు గాక వెళ్ళేటప్పుడు ఫుల్ బాటిల్ కార్లో పెట్టాలట" అన్నాను నాకు తెలిసిన వివరాలను చెప్తూ.

"ఐతే ఏం? చంద్ర షష్టిపూర్తికి సభాసామ్రాట్ ఐతేనే బాగుంటుంది. ఉపన్యాసం దంచుతాడు. సభ సక్సెస్ అవుతుంది" అన్నాడు రాజగోపాల్.

నా మాటలకు కొందరు వంత పాడినా రాజగోపాల్ ఏకపక్షంగా సభాసామ్రాట్ వుండాల్సిందేనని వాదించాడు. నాకు వళ్ళుమండినా సర్దుకున్నాను. రాజగోపాల్ ఆయన వీరాభిమాని.

సరే నలుగురం సభాసామ్రాట్ ఇంటికి వెళ్ళాం. విషయం వినగానే "చంద్రమా? ఆయనెవరు?" అన్నాడు.

"గొప్ప రచయిత సార్! పాతిక పుస్తకాలు అచ్చయ్యాయి" అన్నాడు రాజగోపాల్.

సభాసామ్రాట్ వ్యంగ్య ధోరణిలో నవ్వుతూ "పుస్తకాలు అచ్చేయడం ఏమంత గొప్ప? డబ్బులిస్తే అవే అచ్చయిపోతాయి. నాకు తెలిసినాయన వంద పుస్తకాలు అచ్చేశాడు. ఆయన ఇంటి నిండా ఎక్కడ చూసినా పుస్తకాలే కట్టలు, కట్టలు" అన్నాడు.

మేము ముఖాలు చూసుకున్నాం. ఈలోపల ఆయన డైరీ తీసి చూసి "ఆ రోజు ఖాళీనే. మీ ప్రోగ్రామ్‌కి వస్తాను" అన్నాడు.

రాజగోపాల్ ముఖం చాటంతయింది.

"థాంక్యూ! థాంక్యూ సార్!" అన్నాడు.

రాజగోపాల్ ఆయనతోపాటు పక్కకి వెళ్ళి ఏదో మాట్లాడాడు. ఏం వుంటుంది చదివింపుల గురించే నని నాకు అర్థమైంది. ఇక అందరం బయల్దేరాం. సభాసామ్రాట్‌కి షాక్ ఇవ్వడం ఎలా?

దారిలో నాకొక సందేహం వచ్చింది. చంద్రం ఎవరో తెలియనివాడు సభలో చంద్రం గురించి ఏం మాట్లాడతాడు?

"ఇప్పుడే వస్తా!" అని మా వాళ్ళకి చెప్పి సభాసామ్రాట్ ఇంటికి వెళ్ళాను.

మళ్ళీ ఏమిటి? అన్నట్లు నా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏం లేదు సార్. చంద్రం గురించి సభలో మాట్లాడాలి గదా? ఆయన పుస్తకాలు పంపించమంటారా?" అని అడిగాను.

సభాసామ్రాట్ విలాసంగా నవ్వి "మాట్లాడ్డానికి తెలుసుకోవాల్సిన అవసరం ఏవుంది? ఐనా టూకీగా చెప్పు. ఇంతకీ ఏం రాస్తాడు?" అన్నాడు.

"కథలు. కథారచయిత" అన్నాను.

"ఇక చాలు" అన్నాడు.

"ఆయన పుస్తకాలు.."

"అవసరం లేదు" అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ.

నేను వెళ్ళి మా వాళ్ళను కలిశాను.

"ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు రాజగోపాలరావు.

"ఏం లేదు. చంద్రం పుస్తకాలు పంపమంటారా? అని అడగడానికి వెళ్ళాను" అన్నాను.

"ఆయన ఎప్పుడో చదివి వుంటారు" అని నాలిక కరుచుకున్నాడు రాజగోపాలరావు. చంద్రం ఎవరని అడిగిన విషయం గుర్తుకొచ్చి వుంటుంది. సభలోనే

సభాసామ్రాట్‌కి షాక్ ఇవ్వడానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసిన విషయం ఈ వీరాభిమానికి తెలీదు.

చంద్రం షష్టిపూర్తి రానే వచ్చింది. కమ్యూనిటీ హాలులో సభా సామ్రాట్ చంద్రం గురించి బ్రహ్మాండంగా పొగిడాడు.

"చంద్రం కథలు చదవని పాఠకులు ఆంధ్రదేశంలో దాదాపుగా వుండరు. అసంభవం కూడా. పాతిక కథల పుస్తకాలు ఇంటింటా వుంటాయి. తెలుగు వాళ్ళు కథలంటే చెవులు కోసుకుంటారు. చంద్రం అన్ని రకాల కథలూ ఔపోసన పట్టాడు. స్త్రీల సమస్యల మీద, రాజకీయాల గురించి, ఆఫీసుల్లో జరిగే అన్యాయాలు, ఒకటేమిటి పిల్లల కథలు కూడా రాశారు. ఆమధ్య ఫలానా పబ్లికేషన్స్ వాళ్ళు చంద్రాన్ని ఒకటే పొగిడారు. వాళ్ళ షాపుల్లో బెస్ట్ సెల్లర్స్ చంద్రం కథల పుస్తకాలేనట."

ఈ విధంగా చంద్రం కథలు శిల్పంలో ఎంత గొప్పవో, ఎత్తుగడ, మధ్యమం, ముగింపు ఎత్త గొప్పగా రాస్తాడో దాదాపు గంటసేపు ఉపన్యాసం దంచాడు.

చంద్రం పుస్తకం ఒక్కటి కూడా చదవకుండా, కనీసం పుస్తకం అట్ట కూడా చూడకుండా ఉపన్యాసం దంచడం అంటే మాటలా? అది సభాసామ్రాట్‌కే సాధ్యం.

చంద్రానికి షష్టిపూర్తి సన్మానం కాలనీలోని వివిధ వర్గాల వారు పూలదండలు, బొకేలు ఇవ్వడం పూర్తయిన తర్వాత వందన సమర్పణ చేయడం నా వంతు.

"మేము చంద్రానికి షష్టిపూర్తి చేయడానికి నిర్ణయించుకుని రమ్మని పిలవగానే అంగీకరించి వచ్చిన సభాసామ్రాట్ పార్థసారధిగారికి కృతజ్ఞతలు. ఆయన గంటసేపు చంద్రం కథల గురించి మాట్లాడి సభను ఉర్రూతలూగించారు. కానీ చంద్రం కథారచయిత కాదనీ, నాటకాల రచయితనీ వారికి తెలియజేయడానికి చింతిస్తున్నాను" అన్నాను.

సభలో పెద్దపెట్టున నవ్వులు కురిశాయి.

సభాసామ్రాట్ ముఖం చంద్రుడు లేని ఆకాశంలా నల్లబడిపోయింది. నువ్వే కదయ్యా కథా రచయిత అని చెప్పావు అన్నట్లు నా వైపు చూశాడు.

**-సి.ఎస్.ఆర్.ప్రసాద్ (హైదరాబాద్)**

# మళ్ళీ మొదటికే

**ఎనిమిది గంటలు కొట్టింది వాల్ క్లాక్.**

**నేను వీధి వరండాలో వాలు కుర్చీలో కూలబడ్డాను.**

**సరిగ్గా అప్పుడే మా ఇంటికి వస్తూ కనిపించాడు శ్రీహరి.**

నేను 'హలో' అన్లేదు. అతనూ నన్ను చూసి నన్నగా నవ్వనూ లేదు.

నా ఎదురుగా మరో కుర్చీలో అతను కూర్చున్నాక-

"నిన్న సాయంత్రం మార్కెట్‌లో ఓ సంఘటన జరిగింది" నేను నేరుగా సంభాషణ ప్రారంభించాను.


శ్రీహరి వింటున్నట్టు తలపంకించాడు.

"నాకెందుకో భయంగా ఉంది. అసలీ దేశంలో ఎలా బ్రతకాలో తెలీటం లేదు. నేనా మధ్యతరగతి కుటుంబీకుణ్ణి. వచ్చిన జీతంతో నా సంసారాన్ని ఈదటమే కష్టంగా ఉంది. కూరగాయలు, పప్పు దినుసుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మధ్యలో పెళ్ళిళ్ళు, పేరంటాళ్ళు, రోగాలు, రొష్టులు పిల్లల చదువులు సంధ్యలు ఇవన్నీ చాలక ఫోన్ బిల్లులు కరెంట్ బిల్లులు, ఇంటి అద్దె, పాలు, పేపరు...అబ్బబ్బ ఊపిరి ఆడ్డం లేదు. అలాంటి నన్ను చూసి "హలో గురునాథ్‌రావుగారు నాకో రెండు వేలు అప్పివ్వగలరా..రెండు మాసాల్లో తిరిగిచ్చేస్తాను" అని బస్టాండ్‌లో నన్ను పట్టుకుని చూయింగ్‌గమ్‌లా ఒక పట్టాన వదల్లేదు చలపతి.

నాకు భలే చిరాకనిపించింది. అతగాడి దృష్టిలో నేనెంత అందంగా కనబడుతున్నానో మరి. అతగాడికి మూడిళ్ళు-రెండు మోటారుబళ్ళు ఇంట్లో లాండ్ లైన్ కాక మూడు సెల్ ఫోన్‌లు, బీరువాల్లోకి, భార్య వంటి మీద బోల్డన్ని నగలతో దర్జా వెలగబెడుతున్నాడు. చేస్తున్న వుద్యోగంలో వేలకు వేలు చాలటం లేదు కాబోలు- నన్ను అప్పడుగుతున్నాడంటే ఏమనుకోవాలి-

"ఏది ఏమైనా నేను చాలా కష్టాల్లో ఉన్నాను" అంటూ నా సమస్యలు మొత్తం ఏకరువు పెట్టాను.

శ్రీహరి మౌనంగా అన్నీ వింటున్నాడు. అలా వింటూనే తలాడిస్తూ-నన్నగా నవ్వుతూ-విచారంగా



ముఖం పెడుతూ-నా మీద ఒకింత సింపతీ చూపిస్తున్నట్టు రకరకాల భావప్రకటనలు చేస్తూ చేతి వాచీ చూసుకున్నాడు.

సమయం తొమ్మిదయినట్టు వాల్ క్లాక్ కూడా మళ్ళీ గంటలు కొట్టటం ప్రారంభించింది.

ఇంకా తొమ్మిది కాలేదు. నా వాచీ ఐదు నిముషాలు ఫాస్ట్..అంటున్నా శ్రీహరి లేచి నిలబడిపోయాడు.

అంతే-

వంద రూపాయలు అతడి చేతిలో పెట్టాను.

శ్రీహరి గుమ్మం దిగిపోయాడు.

నేను బరువుగా నిట్టూర్చాను.

ఈమధ్య అందరూ ఆర్థిక సంబంధమైన ఆలోచనలతో బిజీ అయిపోయారు. నా కష్టాలు వినే ఓపిక ఎవరికీ లేదు. అందుకే గుండెలో రగులుతున్న బాధలన్నీ ఎవరికో ఒకరికి చెప్పి బరువు దించుకునే ప్రయత్నంలో శ్రీహరిని రమ్మన్నాను. నా కష్టాలన్నీ ఓ గంట వింటే- వంద రూపాయిలిస్తానన్నాను.

వంద పోతే పోయింది. కాస్త మనశ్శాంతి కలుగుతుందనుకుంటే-సరిగ్గా అప్పుడే నాకో ఊహ వచ్చింది. ఎప్పుడో ఒకనాడు శ్రీహరి నా దగ్గరకొచ్చి ఓ నూట ఏభై రూపాయలు నా చేతిలో పెట్టి తన కష్టాలన్నీ ఏకరువు పెడతాడేమో...

అయ్యబాబోయ్!

**-ఐ.ఎ.నరసింహం (జి.ఎల్.పురం)**